క్లుప్తంగా

సానిగూడెంలో చురుగ్గా కల్వర్టు నిర్మాణం



సానిగూడెంలో కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ రామకృష్ణ (విష్ణు)

దెందులూరు: సానిగూడెంలో మూడు గ్రామాలకు ఉపయోగపడే 40 కుటుంబాలకు చెందిన శ్మశాన స్థలానికి వెళ్లే రోడ్డు కల్వర్టు నిర్మాణ పనులను బుధవారం సానిగూడెం సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) ప్రారంభించారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంజూరు చేసిన నిధులతో రోడ్డు, కల్వర్టు నిర్మిస్తున్నారని గురువారం నుంచి పెన్సింగ్ పనులు ప్రారంభమవుతాయని సర్పంచ్ అన్నారు. అభివృద్ధి పనులకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నానికి సర్పంచ్ విష్ణు, మూడు గ్రామాలకు చెందిన ముస్లిం కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు



గుండుగొలనులో ఫ్లెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

భీమడోలు: బహిరంగ ప్రదేశాల్లో కొంత మంది వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు భీమడోలు పోలీసులు రెండు రోజులుగా తొలగిస్తున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో కొంత మంది వ్యక్తులు తమ అభిమాన నాయకుల పుట్టిన రోజులు, పండుగల పేరుతో శుభాకాంక్షలు తెలుపుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ఆర్భాటంగా బహిరంగ స్థలాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు. వాటి వద్ద ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు కొన్ని ఫ్లెక్సీలు పాడైన, చిరిగిన తరుణంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ తన సిబ్బందితో కలిసి రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలతో బుధవారం వాటిన్నింటికి తొలగించారు.

ఎంపీటీసీల ఛాంబర్ అధ్యక్షుడిగా బండారు నాగరాజు



ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన నాగరాజు

ఉంగుటూరు: ఎంపీటీసీ సభ్యుల ఛాంబర్ మండల అధ్యక్షుడుగా బండారు నాగరాజు ఎన్నికయ్యారు. మంగళవారం ఎంపీటీసీ సభ్యులు సమావేశమై నారాయణపురం ఎంపీటీసీ నాగరాజును ఎంపిక చేశారు. బుధవారం ఎమ్మెల్యే వాసుబాబుకు పుష్పగుచ్చం అందించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. నాగరాజుతోపాటు ఉపసర్పంచి అడపాశ్రీను, వైసీపీ నాయకులు గెడ్డంశ్రీను, పెనుగొండ బాలకృష్ణ ఉన్నారు.

నేడు బావాయిపాలెంలో 'గడపగడపకు'

నిడమర్రు: బావాయిపాలెంలో గురువారం సాయంత్రం 4 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. దీనిలో భాగంగా జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని సత్యకుమార్ పేర్కొన్నారు.

'పది' తరగతులు ప్రారంభించేందుకు అనుమతివ్వండి

ఉంగుటూరు: నీలాద్రిపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని సంబంధిత దస్త్రాలను గ్రామ సర్పంచి చదలవాడ రాజేంద్రకుమార్ కాకినాడ ఆర్జేడీ ఆఫీసుకు పంపించారు. స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సహకారంతో ఈ విద్యా సంవత్సరంలో 9వ తరగతి ప్రారంభించామని రాజేంద్రకుమార్ తెలిపారు. ఆర్జేడీ కార్యాలయానికి వెళ్లిన వారిలో సర్పంచితోపాటు పాఠశాల కమిటీ వైస్ చైర్మన్ కిషోర్ బాబు, ఉపాధ్యాయులు సీహెచ్ రాజేష్ ఉన్నారు.

బైర్రాజు ఫౌండేషన్ సేవలు వినియోగించుకోవాలి

గణపవరం: గ్రామీణప్రాంత మహిళల ఆర్థిక స్వాలంబనకు బైర్రాజు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని కాశిపాడు సర్పంచ్ కోట నాగేశ్వరరావు, గ్రామ వికాస సమితి కన్వీనర్ జంపన వెంకట నర్సింహరాజు అన్నారు. బుధవారం కాశిపాడు బైర్రాజు ఫౌండేషన్ కార్యాలయంలో జీవనోపాదుల విభాగం ఆధ్వర్యంలో 30 మందికి మహిళలకు కుట్టు, ఇతర ఉపాధి శిక్షణ తరగతులు ప్రారంభించారు. శిక్షణ ఈనెల 20 నుంచి జూన్ 18వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. కోఆర్డినేటర్లు టి. పద్మారావు, పి.భానుమూర్తి, ముత్యాల రామకృష్ణ, తెర్లి మేరీరత్నం పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన



భీమడోలులో మహిళల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: అక్క చెల్లెమ్మల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందిస్తున్నారని, ప్రతి ఒక్కరి గుండెల్లో జగనన్న చెరగని ముద్ర వేసుకున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రమైన భీమడోలులో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 141వ రోజైన బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వాసుబాబుకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాల్చుతూ వైసీపీ శ్రేణులు సందడి చేసారు. ఈ సందర్భంగా పెరుమాళ్ల స్తంభం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమాల్లో వాసుబాబు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో జరిగిన సంక్షేమాన్ని వారికి వివరిస్తూ లబ్ధి పత్రాలను అందించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులంతా సంతృప్తిని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ప్రజా సంక్షేమ పాలనను అందిస్తూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పథకాలను అమలు చేస్తూ అవినీతి రహిత పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేస్తున్నారని, కుల, మత, రాజకీయాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు కొనసాగిస్తున్నారన్నారు. అక్క చెల్లెమ్మలు లక్షాధికారులుగా చూడాలన్న ఏకైక సంకల్పంతో నవరత్నాలు అర్హులందరికీ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తూ వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, పచ్చ మీడియా సహకారంతో దుష్ప్రచారాన్ని చేస్తుందన్నారు. ప్రజలంతా తిప్పికొట్టాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఆమోదకరమైన పాలన చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు, పచ్చ మీడియా బురద జల్లేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజలందరికీ మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలంతా చల్లని దీవెనలు అందించి మెండైన ఆశీర్వచనాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీడీవో జీఎల్ఎస్‌వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్, వైస్ ఎంపీపీ మద్దుల ఫణిపద్మజరాజా, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ ఇనపాల సాయి, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా, ఎంపీటీసీ ఆల్తి గోపి, ఎస్‌పీపీ ఆల్తి శ్రీనివాస్, పోలసానిపల్లి, అంబర్‌పేట సర్పంచులు షేక్ రహీమాబేగం హసీనా, ఏపూరి భాను దీపిక రాంబాబు, గుడివాడ నాగ గౌతమి సీతారామాంజనేయులు, ఆలయ కమిటి నిర్వాహకులు సుతాపల్లి ప్రసాద్, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్సై చావా సురేష్‌కుమార్, ఏఈలు డి.సత్యనారాయణ, రామారావు, సతీష్, ఏపీఎం పి.సురేష్, ఏపీవో పద్మ, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి



పూళ్లలో అవగాహన ర్యాలీ

భీమడోలు: నవధాన్యాల సాగు ద్వారా నేలలో భూసారం వృద్ధి చెందుతుందని ప్రకృతి వ్యవసాయం సబ్ డివిజనల్ యాంకర్ నిర్మల అన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో పూళ్లలో ప్రకృతి వ్యవసాయం 2023-24 ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు కరపత్రాలను అందించారు. రైతులతో ర్యాలీ, ప్రదర్శన చేసారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ పంటకు ముందుగా 30 రకాల పచ్చిరొట్ట విత్తనాలను జల్లడం ద్వారా భూమిలో సారం పెరుగుతుందన్నారు. ప్రకృతి సాగు పద్ధతులను అవలంభించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొంది రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఎంపీటీసీ గొండు కృష్ణ చైతన్య, సీఆర్‌పీలు బాబూరావు, కిషోర్, నాగరాజు, వీఏఏలు, మహిళలు పాల్గొన్నారు.

అన్నేవారిగూడెం యూపీ పాఠశాల చిన్నారుల ప్రతిభ



అన్నేవారిగూడెంలో విజేతలకు ప్రశంసాపత్రాలను అందించిన హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్, టీచర్లు

భీమడోలు: దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల చిన్నారులు పోటీల్లో తమ సత్తా చాటారు. పాఠశాలలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈనెల 14న బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కాకినాడకు చెందిన క్రియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డిబేట్, క్విజ్, డ్రాయింగ్, మ్యాప్‌పాయింట్ పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన వారిని అభినందించారు. వ్యాసరచన పోటీల్లో పి.లక్ష్మీతిరుపతమ్మ, అన్నేం పూజిత, నీలం భవానీ, డిబేట్‌లో దొండపాటి చందు గణేష్, దేవి మణికంఠ స్వామి, కుక్కల సాహితి, క్విజ్ పోటీల్లో గుర్రం నాగ చందు, కాంచన వాషిక, నీలం సూర్యప్రకాష్, మ్యాప్ పాయింట్ పోటీల్లో మొల్లి సాయి గణేష్, కుక్కల లలిత, ఆరుళ్ల ఇశ్రాయేల్, చిత్రలేఖనం పోటీల్లో దాసరి చైతన్య కృష్ణకుమారి, పోతుబోయిన బాల ప్రసన్న, మట్టా కొండరాజులు విజేతలుగా నిలిచారు. వారికి ప్రశంసా పత్రాలను హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్, టీచర్లు అందించారు. టీచర్లు ఎం.విజయ కుమారి, ఎం.రవిభారతి, పీఎం శారారాణి, ఉదయభాస్కరశివకుమార్, సాల్మన్ పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

గణపవరం: ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యసిబ్బంది తల్లులకు సూచించారు. బుధవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడులో వ్యాక్సినేషన్ ప్రత్యేక శిబిరం నిర్వహించి పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు షెడ్యూలు ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. పిల్లలకు క్షయ, కోరింతదగ్గు, కంఠసర్పి, తట్టు, పొంగు, ధనుర్వాతం, అతిసార, న్యూమోనియా వంటి వ్యాధులు రాకుండా టీకాలు రక్షణ కల్పిస్తాయన్నారు. గర్భిణులకు టీటీ ఇంజక్షన్లు, రక్తహీనత రాకుండా మాత్రలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తుకు అపూర్వ స్వాగతం



జగనన్నే మా భవిష్యత్తు సర్వే చేస్తున్న వైఎస్సార్ సీపీ దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి గ్రామ గ్రామాన, గడపగడపలో అపూర్వ స్వాగతం లభిస్తోందని అమలు జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. బుధవారం సానిగూడెంలో సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు), గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సర్వే నిర్వహించారు. టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలు, చేసిన పనులు, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు చేసిన సంక్షేమ పథకాల వ్యత్యాసాన్ని ప్రజలందరూ గమనించాలని కామిరెడ్డి నాని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ధనుంజయరావు, రాజేష్, రాంబాబు, వెంకటేశ్వరరావు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఓఎంఆర్ షీట్స్ పంపిణీ చేస్తున్న నిడమర్రు ఎంఈవో కార్యాలయ సిబ్బంది

నిడమర్రు: 1-9 తరగతి విద్యార్థులకు గురువారం నుంచి ప్రారంభించనున్న వార్షిక పరీక్షల (ఎస్‌ఏ-2) నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంఈవో పుచ్చల శేషు తెలిపారు. బుధవారం మండలంలోని ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులకు సంబంధించిన ఓఎంఆర్ షీట్స్ పంపిణీ చేసారు. ప్రశ్నాపత్రాలు ఉదయం 7.30 గంటలలోపు సీఆర్‌పీల ద్వారా పాఠశాల వద్దకు అందించేలా చర్యలు తీసుకున్నట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఓఎంఆర్ షీట్స్ చిరిగినా, తక్కువైనా బఫర్ ఓఎంఆర్ షీట్స్ ముందుగానే హెచ్‌ఎంలకు అందించామన్నారు. ఈనెల 28 వరకూ పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సంబంధిత విద్యార్థుల ఓఎంఆర్ షీట్లు అన్ని సీల్ చేసి 28 మధ్యాహ్నం 2 గంటలలోపు ఎంఈవో కార్యాలయానికి అందించాలని హెచ్‌ఎంలను ఆదేశాలు జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. పబ్లిక్ పరీక్షలు మాదిరిగా ఎస్‌ఏ-2 పరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆయన సూచించారు.

ఎస్‌ఏ-2 పరీక్షలకు సర్వం సిద్ధం

గణపవరం: ఎండల తీవ్రత దృష్ట్యా వార్షిక పరీక్షలు సమ్మేటివ్ ఎసెస్‌మెంట్ (ఎస్‌ఏ-2) సమయాన్ని ప్రభుత్వం మార్పు చేసింది. తాజాగా 1 నుంచి 8 తరగతుల వారికి ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ, 9వ తరగతి విద్యార్థులకు 11.15 గంటలవరకూ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ పరీక్షలు ఈనెల 27వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఉన్నత పాఠ శాలల్లో ఈనెల 20న తెలుగు, 24న హిందీ, 25న ఇంగ్లీషు, 26న గణితం, 27న సైన్సు, 28న సోషల్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులను కేటాయించి నంబర్లు వేశారు. ఈ ఏడాది కూడా క్లాస్‌రూమ్ బేస్డ్ ఎసెస్‌మెంట్ (సీబీఏ) పద్ధతిలోనే పరీక్షలను ఓఎంఆర్‌షీట్లతో నిర్వహించనున్నారు. ఉంగుటూరు నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆధీనంలో ఉన్న సుమారు 400 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతులు చదువుతున్న 27 వేల మంది విద్యార్థులు ఈవార్షిక పరీక్షలు రాయనున్నారు.

పోలీసులపై చంద్రబాబు జులుం ప్రదర్శించడం తగదు

పెదపాడు: పోలీసులపై చంద్రబాబు జులుం ప్రదర్శించడం దుర్మార్గమని నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. ఇటీవల నూజివీడులో పోలీసులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. పోలీసులు పెట్టిన ప్రతి కేసు పరిశీలించి వారిపై తిరిగి కేసులు పెడతానని చెప్పడంపై చంద్రబాబు తీరు ప్రజలకు అద్దం పడుతోందని విమర్శించారు. చంద్రబాబును ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పోలీసులు ఎవరికీ వత్తాసు పలకరని పార్టీ భేదాలు చూపరని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తూ పోలీసులతో తగాదా పడి వారిపై దురుసుగా వ్యవహరించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. నాయకులు పామర్తి అచ్యుత్ గౌడ్, సాధం కిశోర్, గుణుపూరు మహేష్ పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి



భూ సర్వేపై డ్రోన్ సర్వేను ప్రారంభించిన జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, సర్పంచులు

భీమడోలు: భూ వివాదాల సత్వర పరిష్కారమే జగనన్న శాశ్వత భూ హక్కు- భూరక్ష పథకం లక్ష్యమని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా బుధవారం డ్రోన్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ ప్రారంభించారు. భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం, గుండుగొలను, అంబర్‌పేట గ్రామాలకు సంబంధించిన భూ సర్వేను రెండు గంటల పాటు నిర్వహించి పూర్తి చేసారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షంషూద్దీన్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు పథకం సత్ఫలితాలిస్తోందన్నారు. ఇప్పటికే మండలంలోని కోడూరుపాడు, దుద్దేపూడి గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే పూర్తయ్యిందన్నారు. తద్వారా గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా రైతులు, ప్రజలు ఎంతగానో సంతృప్తి చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం సర్పంచులు పాము సునీతామాన్‌సింగ్, షేక్ రహీమాబేగం హసీనా, వెజ్జు బాలాజీ, మండల సర్వేయర్ ధర్మారావు, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు, వీఆర్వోలు వినయ్, డి.సింహాచలం, వెజ్జు నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

భీమడోలు: గుండుగొలనుకు చెందిన కూర్మా రాజ్‌కుమార్ బుధవారం ఉదయం మద్యం మత్తులో చేతికి గాయం చేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుండుగొలను సచివాలయం వద్ద స్పృహ కోల్పోయి పడిపోయిన అతన్ని 108 అంబులెన్స్‌లో భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజ్‌కుమార్ మద్యానికి బానిసై నిత్యం వేధించడంతో అతని భార్య విసుగుచెంది పుట్టిల్లు అంబర్‌పేటకు వెళ్లిపోయింది. దీంతో రాజ్‌కుమార్ మనస్థాపంతో మద్యం సేవించి సీసా పెంకుతో తెల్లవారుజామున చేతి మణికట్టు వద్ద కోసుకోవడంతో రక్తస్రావమై పడిపోయాడు. పారిశుద్ధ్య కార్మికుడు గుర్తించి గ్రామ కార్యదర్శి ద్వారా భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. పంచాయతీ ఉద్యోగులను, స్థానికులను భయభ్రాంతులకు గురి చేయడంతోపాటు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన రాజ్‌కుమార్‌పై భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేశవరంలో కంటి పరీక్షలు



కేశవరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం వరమని, ఈ కార్యక్రమంలో కంటి పరీక్షలుచేసి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు ఇస్తామని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారులు కె.ప్రియాంక, ఐ.దివ్య అన్నారు. బుధవారం గణపవరం మండలం కేశవరం గ్రామ సచివాలయంలో వృద్ధులకు కంటివెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం తదితర అంశాలు వివరించారు. వారానికి మూడు సార్లు ఆకుకూరలు తినాలని సూచించారు. ఈ సందర్భంగా 60 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు పడినట్లు ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. సర్పంచ్ మిడతాని కామేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు దండు విజయదుర్గ, సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ఉంగుటూరు: కొత్త ఉంగుటూరులో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరో రోజైన బుధవారం 5 మ్యాచ్‌లు నిర్వహించారు. సరిపల్లి, నారాయణపురం, భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు, గణపవరం, అర్ధవరం, చానమిల్లి, వెల్లమిల్లి జట్లు తలపడ్డాయి. ప్రతి మ్యాచ్‌లో ఒకరిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కి ఎంపిక చేశారు.

రేకుల షెడ్డు దగ్ధం



గుండుగొలను ఎస్సీ కాలనీలో దగ్ధమైన రేకుల షెడ్డు

భీమడోలు: గుండుగొలనులో ఎస్సీ కాలనీలో ఓ రేకుల షెడ్డు బుధవారం సాయంత్రం అగ్ని ఆహుతైంది. దీనితో బాధిత కుటుంబం కట్టుబట్టలతో రోడ్డున పడింది. సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. ఇంటిలోని గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గుండుగొలనులోని ఎస్సీ కాలనీలో జంగం దావీదు రాజు ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. అతని ఇంటి పక్కనే ఓ వ్యక్తి చెత్తకు నిప్పంటించాడు. దీనితో మంటలు రేగి పక్కనే జంగం దావీదురాజు నివాసముంటున్న ఇంటి చుట్టు ఉన్న తడికి నిప్పు అంటుకుని గాలికి మంటలు ఎగసిపడి రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిని ఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపకాధికారి జి.నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేసారు. ఇంట్లోని టీవీలు, బీరువా, మంచాలు, పాసు పుస్తకాలు, బాండ్లు, రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు కాలి బూడిదయ్యాయి. దీనితో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని మానవతావాదులు ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పెదవేగి : ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం పంచాయతీ పరిధిలోని సీతాపురానికి చెందిన ఉండవల్లి రాంప్రసాద్ (42), ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది ఈనెల 17న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడని అతని కుమారుడు ఉండవలి లోకనాథజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సీపీఎం, సీపీఐ ప్రచార భేరి యాత్ర ప్రారంభం

పెదవేగి : కేంద్ర మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పెదవేగి మండలంలో బుధవారం ప్రచార భేరి యాత్రను నిర్వహించారు. మండలంలోని జానంపేట, విజయరాయి, రాయన్నపాలెం, రాట్నాలకుంట, పెదవేగి, లక్ష్మీపురం గుండా ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు ఏ.శ్యామలా రాణి కె శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పి.పెంటయ్య మాట్లాడారు. ఒకే దేశం ఒకే పన్ను విధానం పేరుతో అన్ని వస్తువుల ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారం వేసిందని విమర్శించారు. కేంద్ర విద్యుత్ సవరణ చట్టం తీసుకువచ్చి విద్యుత్ ప్రైవేటీకరణ చేసి ఛార్జీలు మరింత పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని చెప్పారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: ఏపీ గురుకుల విద్యాలయ సంస్థలో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వట్లూరులోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ప్రిన్సిపాల్ డీ మేరీ ఝాన్సీ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశానికి ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్‌లో ప్రవేశానికి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు గురుకుల విద్యాలయ సంస్థ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లో బ్లూ లేదా బ్లాక్ బాల్‌పెన్‌తో మాత్రమే బబ్లింగ్ చేయాలన్నారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా మాస్క్ ధరించి లోపలికి రావాలన్నారు. ఆధార్ కార్డు తీసుకుని పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

పెదపాడు: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించండి, దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఎం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రచార భేరీ యాత్ర బుధవారం నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న దెందులూరు నియోజవర్గం ప్రచార భేరి యాత్రను పెదపాడు మండలంలోని బళ్ల రేవుతూము సెంటర్‌లో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు సీపీఎం జిల్లా కమిటీఅ సభ్యులు కే శ్రీనివాస్ ప్రారంభించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఏ శ్యామలారాణి, సీపీఐ జిల్లా నాయకులు పోటేలు పెంటయ్య సీపీఎం నాయకులు లింగం కృష్ణారావు, గుండపనేని సురేష్ గన్ను వెంకట్రావు, షేక్ కరీముల్లా, పిట్టారాహేలు, రెడ్డి లక్ష్మణరావు, జానసాయి, పండూరి శ్రీనువాసరావు, పామర్తి చిన్ని, ఎం సిరి పాల్గొన్నారు.

పిప్పరలో కరోనా కలకలం

గణపవరం: మండలంలోని పిప్పరలో కరోనా కేసు వెలుగులోకి రావడం కలకలం రేపింది. పిప్పర వడ్డిగూడెంకు చెందిన 50 ఏళ్ల వ్యక్తి నాలుగురోజులుగా జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో బాధపడుతూ బుధవారం ఉదయం పీహెచ్‌సీకి చికిత్సకోసం వచ్చాడు. అతని లక్షణాలను గుర్తించి వైద్యసిబ్బంది కరోనా పరీక్ష చేయడంతో పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీనితో అతనికి మెడికల్ కిట్ ఇచ్చి హోం ఐసోలేషన్ చేశారు. అతని ఇంటి పరిసరాల్లో శానిటేషన్ చేశారు. అతని ఇంట్లో కుటుంబ సభ్యులు మరో ముగ్గురికి కూడా కరోనా నిర్ధారణ పరీక్షలు చేసి రిపోర్టు కోసం ఏలూరుకు పంపించినట్టు వైద్యాధికారిణి ప్రియాంక తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా కరోనా జాగ్రత్తలు పాటించాలని, మాస్క్ ధరించాలని సూచించారు.

తొలి కేసు పిప్పరలోనే

కరోనా కేసులు పెరుగున్న ప్రస్తుత తరుణంగా గణపవరం మండలంలో తొలి కరోనా కేసు బుధవారం పిప్పర వడ్డిగూడెంలో నమోదైంది. గతంలో మూడేళ్లక్రితం కరోనా మహమ్మారి మొదటి సారి వ్యాప్తి చెందిన సమయంలోనూ గణపవరం మండలంలో తొలి కేసు పిప్పర వడ్డిగూడెంలోనే నమోదైంది. అప్పట్లో ఒక శుభకార్యానికి కృష్ణాజిల్లా కైకలూరు ప్రాంతానికి వెళ్లివచ్చిన ఒక మహిళకు కరోనా సోకడంతో ఆమెను తాడేపల్లిగూడెంలోని ఐసోలేషన్ కేంద్రానికి తరలించారు.

దెందులూరులో 8 కరోనా పాజిటివ్ కేసులు

దెందులూరు: మండలంలో బుధవారం 8 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి తెలిపారు. మండల ప్రజలు కరోనా నిబంధనలు పాటించి కరోనా బారిన పడకుండా స్వీయరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.